


# టీ20 చరిత్రలో తొలిసారి..

# మూడు సూపర్ ఓవర్లతో తేలిన ఫలితం

అంతర్జాతీయ టీ20 చరిత్రలోనే అసాధారణ సందర్భం చోటుచేసుకుంది. త్రైపాక్షిక సిరీస్‌లో భాగంగా నేపాల్, నెదర్లాండ్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఏకంగా మూడు సూపర్ ఓవర్లు జరిగాయి. రెండు జట్ల మధ్య పలుమార్లు స్కోర్లు సమం అవడంతో చివరకు మూడో సూపర్ ఓవర్‌లో ఫలితం తేలింది. ఇలా అంతర్జాతీయ టీ20లో మూడుసార్లు సూపర్ ఓవర్ జరగడం ఇదే తొలిసారి కావడం గమనార్హం.

తొలుత బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 152 పరుగులు చేసింది. ఆ తర్వాత ఛేదన ఆరంభించిన నేపాల్ జట్టు వరుసగా వికెట్లు కోల్పోవడంతో కష్టాల్లో పడింది. విజయం తమదేనని డచ్ భావించిన వేళ నేపాల్ టెయిలెండర్ నందన్ యాదవ్ పోరాడాడు. చివరి ఓవర్‌లో రెండు బౌండరీలు బాదడంతో నేపాల్ స్కోరును (152/8) సమం చేసింది.

మ్యాచ్ టై అవడంతో సూపర్ ఓవర్ నిర్వహించారు. తొలి సూపర్ ఓవర్‌లో ఇరు జట్లూ 19 పరుగులు చేయడంతో రెండోసారి టైబ్రేకర్ ఆడించారు. అందులోనూ రెండు జట్లూ చెరో 17 పరుగులు చేశాయి. దీంతో ఫలితం తేలడం కోసం మూడోసారి సూపర్ ఓవర్ నిర్వహించారు. అందులో డచ్ ఆల్ రౌండర్ జాచ్ లయన్-కాచెట్ నేపాల్‌కు ఒక్క పరుగు కూడా ఇవ్వకుండా.. నాలుగు బంతుల్లో రెండు వికెట్లు తీశాడు. దీంతో నెదర్లాండ్స్ లక్ష్యం ఒక్క పరుగుగా మారింది. ఛేదనకు దిగిన డచ్ జట్టు ఒక్క బంతికే సిక్స్ కొట్టి విజయం దక్కించుకుంది.

# రోహిత్ శర్మం విరాట్ కోహ్లా

# శుభ్‌మన్ గిల్: జోస్ బట్లర్




రోహిత్ శర్మ విరాట్ కోహ్లీల నైపుణ్యాలు ఒక్కటైతే టీమ్ఇండియా నూతన టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ అని ఇంగ్లండ్ క్రికెటర్ జోస్ బట్లర్ అని పేర్కొన్నాడు. జూన్ 20 నుంచి ప్రారంభం కానున్న ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్‌లో గిల్ రాణిస్తాడన్న ఆశాభావం వ్యక్తం చేశాడు. 'శుభమన్ గిల్ నిజంగా తన ఆటతీరుతో ఆకట్టుకునే యువ ఆటగాడు. అతడు మాట్లాడేటప్పుడు చాలా ప్రశాంతంగా కనిపిస్తాడు. మైదానంలో కాస్త దూకుడుగా ఉంటాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ కలిస్తే శుభ్‌మన్ గిల్ అని నేను అనుకుంటున్నాను. అతడు ఆ ఇద్దరు దిగ్గజాల నుంచి ఎంతో నేర్చుకున్నాడు. కానీ చాలా వరకు ఆటపై తన సొంత ముద్ర వేస్తాడు. టెస్ట్ క్రికెట్‌లో భారత జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం దేశంలో మూడో లేదా నాలుగో అత్యంత ప్రభావవంతమైన వ్యక్తి హోదా పొందడం లాంటిది. గిల్ క్రీజులో ఉన్నప్పుడు బ్యాటర్‌గా ఉండాలని కోరుకుంటాడు, ఆపై అతను తన కెప్టెన్సీపై దృష్టి పెట్టాలని చూస్తాడు. అంటే రెండు పాత్రలకూ న్యాయం చేయాలని ప్రయత్నిస్తాడు' అని జోస్ బట్లర్ తన పాడ్‌కాస్ట్‌లో ఇంగ్లండ్ మాజీ పేసర్ స్టువర్ట్ బ్రాడ్‌తో కలిసి అన్నారు.

అలాగే ఐపీఎల్ 2025లో సత్తా చాటిన టీనేజ్ థండర్ వైభవ్ సూర్యవంశీ ) గురించి అతడు మాట్లాడాడు. 'రాజస్థాన్ రాయల్స్ (%తరఫున గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ 35 బంతుల్లో సెంచరీ చేశాడు. ఇది ఐపీఎల్‌లో రెండో వేగవంతమైన సెంచరీ. అతడి ఆటతీరు స్ఫూర్తిదాయకంగా ఉంది. నిజానికి సూర్యవంశీ వయసులో నా కంటే సుమారు 20 సంవత్సరాలు చిన్నవాడు. అలాంటి వ్యక్తి యావత్ క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యచకితుల్ని చేశాడు' అని జోస్ బట్లర్ విశ్లేషించాడు.

ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డు క్రిస్‌గేల్ ( పేరిట ఉంది. 2013లో గేల్.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు తరఫున ఆడుతూ పుణె వారియర్స్‌పై కేవలం 30 బంతుల్లోనే సెంచరీ చేశాడు. ఈ మ్యాచ్‌లో అతడు 175 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

# అతడు.. ఇక రిటైర్ అయిపో అన్నాడు



దిల్లీ: తన కెరీర్‌లో 2022 చివర్లో ఎంతో క్లిష్టంగా గడిచిందని కరుణ్ నాయర్ అన్నాడు. ఒక పెద్ద భారత క్రికెటర్ రిటైర్ అయిపోమని తనకు సలహా ఇచ్చాడని చెప్పాడు. ఎనిమిదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత భారత జట్టుకు ఎంపికైన కరుణ్.. అశ్విన్‌తో యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడాడు. "కొన్ని పరిస్థితులను తలుచుకుంటే 2022 ఏడాది చివరే నా కెరీర్‌లో అత్యంత గడ్డు కాలంగా చెప్పొచ్చు. ఎంతో ఉద్వేగంతో కూడిన సమయమది. ఒక భారత స్టార్ 'నువ్విక రిటైర్ అయిపో. విదేశీ టీ20 లీగుల్లో ఆడు' అని సలహా ఇచ్చాడు" అని కరుణ్ గుర్తు చేసుకున్నాడు. 2016లో ఇంగ్లాండ్‌పై టెస్టు అరంగేట్రంలోనే ట్రిపుల్ సెంచరీ చేసినా.. తర్వాత శ్రీలంకతో (2017)తో టెస్టు సిరీస్‌లో చోటు దక్కకపోవడం చాలా బాధ కలిగించదని కరుణ్ తెలిపాడు. "2016 చెన్నైలో ఇంగ్లాండ్‌పై 300 పరుగులు చేసిన తర్వాత స్వదేశంలోనే ఆస్ట్రేలియాతో సిరీస్‌లో ఆడా. తర్వాతి ఏడాది శ్రీలంకతో సిరీస్‌లో స్థానం ఖాయం అనుకుంటే నా పేరు పరిగణనలోకి తీసుకోలేదు.

# ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్..

# టీమ్ఇండియా స్క్వాడ్‌లో మరో ఆటగాడు..



మరో మూడు రోజుల్లోనే టీమ్ఇండియా ఇంగ్లండ్ టెస్ట్ సిరీస్ ప్రారంభం కానుంది. రోహిత్ శర్మ విరాట్ కోహ్లీ ) సుదీర్ఘ ఫార్మాట్‌కు తమ రిటైర్మెంట్లు ప్రకటించిన తర్వాత భారత జట్టును యువకులతో భర్తీ చేశారు. శుభ్‌మన్ గిల్‌కు టెస్ట్ పగ్గాలు దక్కాయి. వైస్ కెప్టెన్‌గా రిషభ్‌పంత్ ( నియమితుడయ్యాడు. మే 24న 18 మంది సభ్యులతో కూడిన భారత జట్టును బీసీసీఐ ప్రకటించింది. మొదటిసారిగా సాయిసుదర్శన్ టెస్టు జట్టులో చోటు దక్కించుకున్నాడు. అలాగే కరుణ్ నాయర్, శార్దూల్ ఠాకూర్ సుదీర్ఘ ఫార్మాట్‌లోకి పునరాగమనం చేయనున్నారు.

ఈ జట్టులో జస్ప్రీత్ బుమ్రా మహ్మద్ సిరాజ్ ప్రసిద్ధ్ కృష్ణ, ఆకాశ్ దీప్, అర్షదీప్ సింగ్ రూపంలో అయిదుగురు బౌలర్లున్నారు. అలాగే హర్షిత్ రాణా కూడా జట్టుతో కలవనున్నట్లు పలు వార్తలు వినిపిస్తున్నాయి. ఇదే నిజమైతే టీమ్ఇండియా స్క్వాడ్‌లో ఆటగాళ్ల సంఖ్య 18 నుంచి 19కు పెరగనుంది. కానీ ఈ విషయమై బీసీసీఐ నుంచి అధికారికంగా ఇప్పటివరకు ఎటువంటి ప్రకటనా వెలువడలేదు. భారత్ ఏ జట్టు, ఇంగ్లండ్ లయన్స్‌కు మధ్య జరిగిన మొదటి అనధికార టెస్టులో హర్షిత్ రాణా 99 పరుగులిచ్చి ఒక వికెట్ తీసుకున్నాడు. బ్యాటింగ్‌లో 16 పరుగులు చేశాడు.

హర్షిత్ రాణా గత సంవత్సరం ఆస్ట్రేలియాతో జరిగిన మ్యాచ్‌లో టెస్ట్ అరంగేట్రం చేశాడు. అతడు 50.75 యావరేజ్‌తో నాలుగు వికెట్లు తీసుకున్నాడు. 48/3 అతడి బెస్ట్ బౌలింగ్ ఫిగర్స్. ఈ ఫీట్.. అతడు పెర్త్‌లో సాధించాడు. ఓవరాల్‌గా రాణా 13 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడి 27.79 యావరేజ్‌తో 48 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ఒక సెంచరీ, రెండు హాఫ్ సెంచరీలు కూడా సాధించాడు.

# బంతిదే బాధ్యత

భారత క్రికెట్ జట్టు ఏదైనా ప్రధాన సిరీస్ లేదా టోర్నీలో ఆడబోతుంటే.. అందరి దృష్టీ బ్యాటింగ్ విభాగం మీదే ఉంటుంది. దశాబ్దాల నుంచి మన బలం బ్యాటింగే కాబట్టి వాళ్ల ప్రదర్శనను బట్టే జయాపజయాలు ఆధారపడి ఉంటాయన్నది నిశ్చితాభిప్రాయం! ప్రపంచ స్థాయి బ్యాటర్లతో మన జట్టు కళకళలాడుతుండేది. కానీ ఇప్పుడు కథ మారింది. విరాట్ కోహ్లి, రోహిత్ శర్మల రిటైర్మెంట్‌తో భారత బ్యాటింగ్ విభాగంలో అనుభవ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. బ్యాటర్లపై మరీ అంచనాలు లేవు. కానీ బుమ్రా నేతృత్వంలోని బౌలింగ్ విభాగం మాత్రం ఆశలు రేకెత్తిస్తోంది. సిరీస్ ఫలితాన్ని నిర్ణయించేది బౌలర్లే అంటే అతిశయోక్తి కాదు.

టెస్టుల్లో భారత్‌కు కఠినంగా దేశాల్లో ఇంగ్లాండ్ ఒకటి. అక్కడి వాతావరణం, పిచ్‌లు మనవాళ్లకు సవాలు విసురుతాయి. వీటిని ఇంగ్లాండ్ బాగా ఉపయోగించుకుంటుంది. భారత్ మాత్రం తడబడుతుంది. చాలా సిరీస్‌ల్లో ఇదే జరిగింది. ఈసారి కోహ్లి, రోహిత్ లేక అనుభవం తగ్గిన భారత బ్యాటింగ్ విభాగం ఇక్కడ ఏమేర రాణిస్తుందన్నది ప్రశ్నార్థకం. అయితే బౌలింగ్ విభాగం మాత్రం ఆశలు రేకెత్తిస్తోంది. జస్‌ప్రీత్ బుమ్రాకు తోడు మహ్మద్ సిరాజ్, శార్దూల్ ఠాకూర్ లాంటి అనుభవజ్ఞులు.. ప్రసిద్ధ్ కృష్ణ, అర్ష్‌దీప్ లాంటి యువ ప్రతిభావంతులతో భారత పేస్ విభాగం మెరుగ్గా కనిపిస్తోంది. జడేజా, కుల్‌దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్‌లతో కూడిన స్పిన్ విభాగం కూడా పర్వాలేదు. కానీ అటువైపు ఇంగ్లాండ్ బ్యాటింగ్ విభాగం మామూలుగా లేదు. ఓవైపు దిగ్గజ బ్యాటర్ జో రూట్.. ఇంకోవైపు బెన్ స్టోక్స్, ఓలీ పోప్ లాంటి అనుభవజ్ఞులు.. మరోవైపు జాక్ క్రాలీ, బెన్ డకెట్, జేమీ స్మిత్ లాంటి ప్రమాదకర బ్యాటర్లతో ఇంగ్లిష్ బ్యాటింగ్ విభాగం ఉత్తమంగా కనిపిస్తోంది. సొంతగడ్డపై ఆ జట్టు బ్యాటింగ్ రికార్డు గురించి కొత్తగా చెప్పాల్సిన పని లేదు. తమ బౌలర్లు విజృంభించిన పిచ్‌ల మీదే భారీ స్కోర్లు చేయడం వారికి అలవాటు. ముఖ్యంగా బజ్‌బాల్ శైలితో ప్రత్యర్థి బౌలర్లను బెదరగొట్టడం ఇంగ్లాండ్ ప్రత్యేకత. మరి వీరికి బుమ్రా బృందం ఎలా అడ్డుకట్ట వేస్తుందన్నది ఆసక్తికరం.

## నడిపించాల్సింది అతనే..




బౌలింగ్‌లో భారత్ ఆశలన్నీ దళపతి బుమ్రా మీదే అనడంలో సందేహం లేదు. ప్రపంచంలో ఎలాంటి పిచ్ మీద అయినా సత్తా చాటగల బుమ్రాపై అభిమానుల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆస్ట్రేలియా సిరీస్‌లో భారత్ ఓటమి పాలైనా.. బుమ్రా ప్రదర్శన అసాధారణం. ఆస్ట్రేలియా బ్యాటర్లకు అతను శక్తిమేర కళ్లెం వేశాడు. అతడి ప్రదర్శనను ఆసీస్ మీడియా సైతం కొనియాడింది. అయితే అదే సిరీస్‌లో బుమ్రా గాయపడి నాలుగు నెలల పాటు ఆటకు దూరమయ్యాడు. ఐపీఎల్‌లో పునరాగమనం చేసినా.. అతడి ఫిట్‌నెస్‌పై సందేహాలు కొనసాగుతున్నాయి. బుమ్రా సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లూ ఆడే అవకాశం లేదని చీఫ్ సెలక్టర్ అగార్కర్ స్పష్టం చేశాడు. అయినప్పటికీ ఆడే మ్యాచ్‌ల్లో బుమ్రా అత్యంత కీలకంగా మారతాడు. దూకుడుగా ఆడే ఇంగ్లాండ్ బ్యాటర్లకు ఆరంభంలోనే కళ్లెం వేయాల్సిన బాధ్యత అతడి మీదే ఉంది. అతను శుభారంభాలందిస్తే.. మిగతా బౌలర్లూ అందిపుచ్చుకుంటారు. ఇంగ్లాండ్‌లో 9 టెస్టులాడి 26.27 సగటుతో 37 వికెట్లు పడగొట్టాడు.

ఇక ఇంగ్లాండ్‌లో 6 టెస్టులాడి 23 వికెట్లు తీసిన రికార్డున్న సిరాజ్.. ఇటీవల తడబడుతున్నాడు. ఆస్ట్రేలియాలో అతను నిరాశపరిచాడు. ఇంగ్లాండ్‌లో అతను ఫామ్ అందుకుని సత్తా చాటాలని జట్టు ఆశిస్తోంది. రెండేళ్లకు పైగా జట్టుకు దూరమైన శార్దూల్ ఠాకూర్ ఇటీవల దేశవాళీల్లో రాణించి సెలక్టర్ల నుంచి పిలుపు అందుకున్నాడు. అతడికి ఇంగ్లాండ్‌లో 4 టెస్టులాడిన అనుభవముంది. 10 వికెట్లు తీశాడు. మరి ఆ అనుభవాన్ని అతను ఈసారి ఏమేర ఉపయోగించుకుంటాడో చూడాలి.

ఇక ఈ సిరీస్‌లో ఓ అరంగేట్ర ఆటగాడికి అవకాశం దక్కే సూచనలున్నాయి. అతనే.. అర్ష్‌దీప్ సింగ్. ఇప్పటికే టీ20లు, వన్డేల్లో తనదైన ముద్ర వేశాడు అర్ష్‌దీప్. ఎడమ చేతి వాటం బౌలర్ కావడం వల్ల అతడికి తుది జట్టులో చోటు దక్కే అవకాశాలు మెరుగు. స్వింగ్ బౌలర్‌గా పేరున్న అర్ష్‌దీప్.. ఇంగ్లాండ్‌లో పరిస్థితులను బాగా ఉపయోగించుకోగలడని అంచనా. ఐపీఎల్‌లో అదరగొట్టిన ప్రసిద్ధ్ కృష్ణ కూడా సిరీస్‌లో చూడదగ్గ బౌలర్.

ఆస్ట్రేలియా సిరీస్‌కు ఎంపికైనప్పటికీ తుది జట్టులో ఆడే అవకాశం దక్కని ప్రసిద్ధ్.. దేశవాళీల్లో, ఐపీఎల్‌లో అదరగొట్టాడు. బుమ్రా రెండు మ్యాచ్‌లకు దూరమవుతాడన్న అంచనాల నేపథ్యంలో అతడి స్థానాన్ని ప్రసిద్ధ్‌యే భర్తీ చేయొచ్చు. సిరీస్ ఆరంభంలో సిరాజ్ రాణించకపోతే అతడిని పక్కన పెట్టి ప్రసిద్ధ్‌ను ఆడించే అవకాశం కూడా లేకపోలేదు. మరి ఛాన్స్ వస్తే ప్రసిద్ధ్ ఏమేర రాణిస్తాడో చూడాలి. ఇంగ్లాండ్‌లో స్పిన్నర్ల ప్రభావం తక్కువే అయినా.. జడేజా, కుల్‌దీప్, సుందర్‌లతో భారత్‌కు మెరుగైన స్పిన్ విభాగం ఉంది. స్పిన్‌కు అనుకూలించే పిచ్‌లపై జడేజాకు తోడుగా కుల్‌దీప్ లేదా సుందర్ తుది జట్టులో ఉంటారు. లేదా జడేజా ఒక్కడే ఆడే అవకాశముంది. అతను ఇంగ్లాండ్‌లో 12 టెస్టులాడి 27 వికెట్లు తీశాడు.

## రాణా అక్కడే..

ఇంగ్లాండ్ లయన్స్‌తో అనధికారిక టెస్టులు ఆడేందుకు ఇండియా-ఎ జట్టుతో పాటు వెళ్లిన యువ పేసర్ హర్షిత్ రాణా.. ఆ సిరీస్ ముగిసినా స్వదేశానికి రావట్లేదు. టెస్టు జట్టుకు అవసరం కావచ్చనే ఉద్దేశంతో అతణ్ని ఇంగ్లాండ్‌లోనే ఉంచింది బీసీసీఐ. అతను భారత జట్టుతో కలవబోతున్నాడు. ప్రత్యామ్నాయ ఆటగాడిగా టీమ్ఇండియాతో కొనసాగనున్న రాణా.. అవసరమైతే జట్టులోకి వస్తాడు. గత ఏడాది ఆస్ట్రేలియాతో సిరీస్‌లో టెస్టు అరంగేట్రం చేసిన రాణా.. 2 మ్యాచ్‌ల్లో 4 వికెట్లే తీశాడు. దీంతో ఇంగ్లాండ్‌తో టెస్టులకు అతణ్ని ఎంపిక చేయలేదు. కానీ ఇప్పుడు అతడికి అనుకోకుండా అవకాశం దక్కేలా ఉంది.

